క్లుప్తంగా

శనైశ్చరునికి ప్రత్యేక పూజలు


శనైశ్చరునికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు

కడ్తాల్: శని త్రయోదశి సందర్భంగా దాసర్లపల్లి గ్రామంలోని శ్రీ వేద విజ్ఞాన పరిషత్ శ్రీమాత క్షేత్రంలో కోటి దీపోత్సవ పురోహితుడు రేవల్లి రాజుశర్మ ఆధ్వర్యంలో శనివారం ఉదయం శనైశ్చరునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమాల్లో భక్తులు, నాయకులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా శనైశ్చరునికి నువ్వుల నూనెతో ప్రత్యేక అభిషేకాలు చేశారు. రైతులు పాడి పంటలతో సుభిక్షంగా ఉండాలని ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు. రాజుశర్మ ఆధ్వర్యంలో శ్రీ మాత క్షేత్రంలో నిర్వహించే పూజ కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు అయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, మాజీ సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి, నాయకులు గణేశ్‌రెడ్డి, అశోక్, లక్ష్మీనర్సింహ, పాత్రికేయులు ఆనంద్ తదితరులు ఉన్నారు.

జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడికి సత్కారం


ఆచారిని సత్కరిస్తున్న బీజేపీ నాయకులు

ఆమనగల్లు: జాతీయ బీసీ కమిషన్ ఆచారిని బీజేపీ మండల అధ్యక్షులుగా నియమితులైన ఎర్రవోలు శ్రీనివాస్, పెద్దయ్య యాదవ్, మహేశ్‌లు సత్కరించారు. నూతనంగా ఆమనగల్లు మండల బీజేపీ అధ్యక్షునిగా ఎర్రవోలు శ్రీనివాస్, మాడ్గుల బీజేపీ అధ్యక్షుడిగా పెద్దయ్య యాదవ్, కడ్తాల్ బీజేపీ అధ్యక్షుడిగా మహేశ్‌లు నియమితులు కాగా వారు శనివారం హైద్రాబాద్‌లో ఆచారిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వారు ఆచారిని సత్కరించారు.

ఘనంగా వడ్డె ఓబన్న జయంతి వేడుకలు


ఓబన్న జయంతి వేడుకల్లో పాల్గొన్న వడ్డెర వృత్తిదారుల సంఘం సభ్యులు

తుర్కయంజాల్: వడ్డె ఓబన్న 218వ జయంతి వేడుకలను వడ్డెర వృత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో తుర్కయంజాల్‌లో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లపు విఘ్నేశ్ మాట్లాడుతూ.. వడ్డె ఓబన్న బ్రిటీష్ ప్రభుత్వంపై గెరిల్లా పోరాటం చేశాడని, ఉయ్యాలవాడ నర్సింహారెడ్డికి సర్వ సైన్యాధ్యక్షుడిగా పనిచేశారని గుర్తుచేశారు. కార్యక్రమంలో మున్సిపాలిటీ అధ్యక్షుడు నర్రపాండు, నాయకులు వరికుప్పల సుధాకర్, గండికోట సత్యం, డేరంగుల వినయ్, వాసు, హరీశ్, శ్రీను, గిరి తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు దుస్తుల పంపిణీ


క్రీడాకారులకు దుస్తులు పంపిణీ చేస్తున్న శ్రీనివాస్‌యాదవ్

ఆమనగల్లు: తలకొండపల్లి మండలం వెల్జాల గ్రామంలో వారంరోజుల పాటు నిర్వహించే క్రికెట్ పోటీలను శనివారం బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు, మాజీ ఎంపీపీ శ్రీనివాస్‌యాదవ్ ప్రారంభించారు. అంతకు ముందు క్రీడాకారులకు డ్రెస్సులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ మాజీ కో–ఆప్షన్ సభ్యుడు ముజబర్ రెహమాన్, సింగిల్ విండో వైస్ చైర్మన్ కూన రవి, మార్కెట్ డైరెక్టర్ వెంకట్‌రెడ్డి, నాయకులు వెంకటేశ్, అజీజ్, అంబాజీ, విష్ణువర్ధన్‌యాదవ్, నరేందర్‌గౌడ్, ప్రకాశ్‌గౌడ్, శ్రీనివాసులు, సుదర్శన్, రాజు, రషీద్, సుధాకర్, అబ్బాస్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు బోనస్ అందించాలి

యాచారం: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సన్నాల కొనుగోలుపై అందజేసే బోనస్ డబ్బుల అందజేతలో తీవ్ర జాప్యం జరుగుతుందని, వెంటనే రైతుల ఖాతాల్లో జమచేయాలని బీఆర్‌ఎస్ మండల ప్రధాన కార్యదర్శి భాషా ప్రభుత్వాన్ని కోరారు. యాచారం మండలంలోని యాచారం, నందివనపర్తి, చింతపట్ల, మంతన్‌గౌరెల్లి గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి వేలాది క్వింటాళ్ల సన్నరకం ధాన్యాన్ని కొనుగోలు చేశారని, ఇంతవరకు బోనస్ డబ్బులు జమచేయడం లేదన్నారు. క్వింటాల్‌కు అందజేసే రూ.500 బోనస్ డబ్బులు రైతుల ఖాతాల్లో జమచేయకపోతే ఆందోళన చేపడతామన్నారు.

క్రీడారంగానికి ప్రభుత్వం పెద్దపీట


ఆమనగల్లు: చుక్కాపూర్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

ఆమనగల్లు: రాష్ట్రంలో క్రీడారంగ అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. తలకొండపల్లి మండలం చుక్కాపూర్ గ్రామంలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్‌ను శనివారం స్థానిక నాయకులతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. విద్యార్థులు, యువత క్రీడల్లో పాల్గొనాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం అందించే సహకారంతో క్రీడాకారులు మరింత రాణించాలన్నారు. విద్యార్థులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం సీఎం కప్ పోటీలను నిర్వహించిందన్నారు. అనంతరం చుక్కాపూర్ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా దాతల సహకారంతో రూ.1.50లక్షలతో ఏర్పాటు చేసిన క్రీడాసామగ్రిని ఆయన ప్రారంభించారు. పాఠశాల నూతన భవనం ఏర్పాటుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు అయిల శ్రీనివాస్‌గౌడ్, క్రికెట్ టోర్నమెంట్ నిర్వాహకులు ఏమిరెడ్డి పాండురంగారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మ్యాకం వెంకట నర్సు, నర్సింహులు, ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు డోకూరు ప్రభాకర్‌రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు ప్రోత్సాహం..

కడ్తాల్: క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. శనివారం మండలంలోని కొండ్రిగానిబోడ్ తండా పంచాయతీ పరిధిలోని పెద్దారెడ్డిచెరువుతండాలో మాజీ సర్పంచ్ సేవ్యాబావోజీ, రాజునాయక్ సహకారంతో నిర్వహిస్తున్న మండలస్థాయి కేబీటీ ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలను స్థానిక నాయకులతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, యాట నర్సింహ, బీక్యానాయక్, బీచ్యానాయక్, అజీం, చేగూరి వెంకటేశ్, లక్ష్మయ్య, మల్లేశ్‌గౌడ్, సత్యం, రమేశ్, రాజేశ్, బిక్కు శ్రీను, గణేశ్, నాజం, ఈశ్వర్ మూన్య, రవి తదితరులు ఉన్నారు.

సంక్రాంతి సందడి..


ఇబ్రహీంపట్నంలో గాలిపటాల దుకాణంలో గిరాకీ


ఇబ్రహీంపట్నంలో రంగులు కొనుగోలు చేస్తున్న మహిళ

ఇబ్రహీంపట్నం: గ్రామాల్లో సంక్రాంతి పర్వదిన వేడుకలకు శ్రీకారం పడింది. విద్యాసంస్థలకు సెలవులు ప్రకటించడంతో పాటు వరుసగా రెండో శనివారం, ఆదివారం కలిసి రావడంతో వివిధ ప్రభుత్వ కార్యాలయాలకు ఈ పర్వదినానికి ముందే సెలువు దినాలు రావడంతో పట్టణాల్లోని ప్రజలు తమ స్వగ్రామాలకు తరలివస్తున్నారు. దీంతో ఆర్టీసీ బస్సుల్లో రద్దీ పెరిగింది. మూడురోజులు సోమవారం భోగి, మంగళవారం మకర సంక్రాంతి, బుధవారం కనుము పర్వదినాలను ప్రజలు జరుపుకోనున్నారు. సంక్రాంతి ముగ్గులు పరిచేందుకు మార్కెట్లో వివిధ రకాల కలర్లకు డిమాండ్ పెరిగింది. విద్యాసంస్థలకు సెలవులు ఉండటంతో పిల్లలు, యువకులు గాలిపటాలకు పర్వదినానికి ముందే భలే గిరాకీ ఏర్పడింది. ఇబ్రహీంపట్నంలోని ప్రధాన రోడ్లలో పతంగుల, మంజా విక్రయాల దుకాణాలు వెలిశాయి. గాలిపటాలపై రాజకీయ, సినీ తారల, వివిధ రకాల జోకర్స్ బొమ్మలను ముద్రించిన వాటిని అధికంగా విక్రయిస్తున్నారు.

బీజేపీ మండల అధ్యక్షుడిగా మహేశ్


దోనాదుల మహేశ్

కడ్తాల్: మండల కేంద్రానికి చెందిన దోనాదుల మహేశ్ బీజేపీ మండల నూతన అధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా మహేశ్ మాట్లాడుతూ.. పార్టీ మండల అధ్యక్షుడిగా తనను నియమించిన జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారికి కృతజ్ఞతలు తెలిపారు. గత 15 సంవత్సరాలుగా పార్టీ బలోపేతానికి, కార్యకర్త స్థాయి నుంచి నిర్విరామంగా చేసిన సేవలను పార్టీ అధిష్టానం గుర్తించిందని ఆయన పేర్కొన్నారు. పార్టీ అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తానని, కార్యకర్తలు, నాయకుల సహకారంతో బీజేపీని మండలంలో తిరుగులేని శక్తిగా తయారుచేసేందుకు నిరంతరం ప్రజల పక్షాన, ప్రజా సమస్యలపై పోరాటం సాగిస్తానని తెలిపారు. అదేవిధంగా తన నియామకానికి సహకరించిన జిల్లా, రాష్ట్రస్థాయి నాయకులకు ఆయన కృతజ్ఞతలు చెప్పారు.

ఆకట్టుకున్న ముగ్గుల పోటీలు


ఇబ్రహీంపట్నం: ముగ్గులు వేసిన విద్యార్థినులతో అధ్యాపకులు

ఇబ్రహీంపట్నం: సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని శనివారం ఇబ్రహీంపట్నంలోని విద్యాంజలి కళాశాలలో ముగ్గుల పోటీలను నిర్వహించారు. విద్యార్థులు వివిధ రంగులతో ఆకర్షణీయంగా ముగ్గులు వేసి అందరినీ ఆకట్టుకున్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థినులకు సిబ్బంది బహుమతులు అందజేశారు. సంక్రాంతి పర్వదినానికి స్వాగతం పలుకుతూ ఆటపాటలతో సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అనిత, కరెస్పాండెంట్ నరేందర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

సంక్రాంతి సంబురాలు..


ఆమనగల్లులో..

ఆమనగల్లు: పట్టణంలోని పలు పాఠశాలల్లో శనివారం సంక్రాంతి సంబురాలను ఘనంగా జరుపుకున్నారు. ఆయా పాఠశాలల్లో విద్యార్థులు రంగురంగుల ముగ్గులను తీర్చిదిద్దారు. విద్యార్థులు పతంగులను ఎగురవేశారు. అదేవిధంగా భోగిమంటలు వేసి సందడి చేశారు.

బీజేపీ ఆమనగల్లు మండల అధ్యక్షుడిగా శ్రీనివాస్


ఎర్రవోలు శ్రీనివాస్

ఆమనగల్లు: ఆమనగల్లు మండల బీజేపీ అధ్యక్షుడిగా మంగళపల్లి గ్రామానికి చెందిన ఎర్రవోలు శ్రీనివాస్ ఎన్నికయ్యారు. శ్రీనివాస్ గతంలో రెండుసార్లు మండల బీజేవైఎం అధ్యక్షుడిగా.. ప్రస్తుతం మండల బీజేపీ ప్రధాన కార్యదర్శిగా పనిచేస్తున్నారు. అదేవిధంగా నాగర్‌కర్నూల్ జిల్లా బీజేపీ కౌన్సిల్ సభ్యుడిగా ఆమనగల్లు మున్సిపాలిటీ కౌన్సిలర్ చెక్కల లక్ష్మణ్ నియమితులయ్యారు. గతంలో మండల బీజేవైఎం అధ్యక్షుడిగా, ఆమనగల్లు మున్సిపాలిటీ బీజేపీ అధ్యక్షుడిగా లక్ష్మణ్ పనిచేశారు. తమకు బీజేపీలో అవకాశం కల్పించడంపై ఎర్రవోలు శ్రీనివాస్, లక్ష్మణ్‌లు జాతీయ బీసీ కమిషన్ మాజి సభ్యుడు తల్లోజు ఆచారికి కృతజ్ఞతలు తెలిపారు. బీజేపీ పటిష్టతకు కృషి చేస్తానని పేర్కొన్నారు.

బీఆర్‌ఎస్ హయాంలో అభివృద్ధి శూన్యం


మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జగన్

ఆమనగల్లు: మున్సిపాలిటీ అభివృద్ధికి కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అత్యంత ప్రాధాన్యతనిస్తున్నారని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జగన్, ఆమనగల్లు మార్కెట్ కమిటీ డైరెక్టర్ వస్పుల శ్రీశైలం అన్నారు. గతంలో పదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు ఆమనగల్లు అభివృద్ధికి ఏమి చేశారో చెప్పాలని వారు డిమాండ్ చేశారు. పట్టణంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జగన్, వస్పుల శ్రీశైలం మాట్లాడుతూ.. గతంలో ఎమ్మెల్యేగా ఉన్న జైపాల్‌యాదవ్ ఆమనగల్లు అభివృద్ధిని పట్టించుకోలేదని విమర్శించారు. కేవలం జీఓలు, మాయ మాటలతో ప్రజలను మభ్యపెట్టారన్నారు. ప్రస్తుత ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నారన్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా నియోజకవర్గ అభివృద్ధికి ఏడాదికాలంలో రూ.300 కోట్లు తీసుకొచ్చారన్నారు. పట్టణంలో ఉనికి కోసం బీఆర్‌ఎస్ నాయకులు తాపత్రయపడుతున్నారని వారు ఎద్దేవా చేశారు. విలేకరుల సమావేశంలో పార్టీ నాయకులు ఖలీల్, అలీం, ఫరీద్, అనిత విజయ్, వస్పుల శ్రీశైలం, ఖాదర్, ప్రసాద్, నాజర్, మహేశ్, శ్రీపాల్, కరీం, రహీం తదితరులు పాల్గొన్నారు.

గురుకులంలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

మొయినాబాద్‌రూరల్: బీసీ, ఎస్సీ, ఎస్టీ, జనరల్ గురుకుల పాఠశాలలో 5వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభిస్తున్నామని సాంఘిక సంక్షేమ చేవెళ్ల బాలికల పాఠశాల ప్రిన్సిపాల్ పి.మాలతీ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సాంఘిక సంక్షేమ చేవెళ్ల బాలికల గురుకుల పాఠశాలలో 2024–25 విద్యా సంవత్సరంలో 4వ తరగతి చదువుతున్న విద్యార్థినులు 5వ తరగతిలో చేరేందుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఫిబ్రవరి 1వ తేదీవరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. దరఖాస్తుకు జోనోఫైడ్, పాస్ ఫొటో, వంద రూపాయల రుసుము చెల్లించాలన్నారు. అదేవిధంగా విద్యార్థికి సంబంధించిన ఏదైనా ఒక ఫోన్ నెంబర్ దరఖాస్తులో నమోదు చేయాలని తెలిపారు. ఏదైనా సందేహాలు ఉంటే 040–23391598లో సంప్రదించాలని కోరారు.

డైరీ, కేలండర్ల ఆవిష్కరణ


డైరీ, కేలండర్‌లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి

ఆమనగల్లు: సమాజంలో ప్రతి ఒక్కరికీ వారు చేసే సేవలపై తప్పనిసరిగా కీర్తి లభిస్తుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. హైద్రాబాద్‌లోని ఎమ్మెల్యే నివాసంలో శనివారం ఆమనగల్లు మండలం కోనాపూర్ గ్రామానికి చెందిన సీనియర్ న్యాయవాది యాదీలాల్ ఆధ్వర్యంలో రూపొందించిన డైరీ, కేలండర్‌లను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. న్యాయవాదులు చట్టాలు, న్యాయవ్యవస్థపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ చైర్మన్‌లు బట్టు కిషన్‌రెడ్డి, నారాయణ, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు శ్రీనివాస్‌రెడ్డి, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, సీనియర్ పాత్రికేయుడు సత్యనారాయణ, నాయకులు సూదిని కొండల్‌రెడ్డి, నారాయణరెడ్డి, కండె సత్యం, వెంకోబా, పద్మనాభం, రాజిరెడ్డి, సురేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

సరస్వతి దేవి విగ్రహావిష్కరణ

మొయినాబాద్: మండల పరిధిలోని వెంకటాపూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో సరస్వతి దేవి విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఆ పాఠశాలలో 2000–2001 సంవత్సరంలో 10వ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు సరస్వతి దేవి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. అప్పుడు పాఠాలు బోధించిన ఉపాధ్యాయుడు, ప్రస్తుత సంగారెడ్డి ఎంపీడీఓ సత్తయ్య, మొయినాబాద్ ఎంపీడీఓ సంధ్య, ఎంఈఓ వెంకటయ్య విగ్రహాన్ని ఆవిష్కరించి పూజలు చేశారు. పూర్వ విద్యార్థులను వారందరూ అభినందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు మల్లయ్య, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

వైద్య వృత్తిని సేవాభావంతో నిర్వహించాలి


వైట్ కోట్ దుస్తులు ధరించిన వైద్య విద్యార్థులతో గురునానక్ చాన్సలర్ కోహ్లి

ఇబ్రహీంపట్నం: వైద్య వృత్తిని సేవాభావంతో నిర్వహించాలని గురునానక్ యూనివర్సిటీ చాన్సలర్ గగన్‌దీప్ సింగ్ కోహ్లి సూచించారు. గురునానక్ హోమియోపతిక్ మెడికల్ కాలేజ్ ఆస్పత్రి ఆధ్వర్యంలో శనివారం విద్యార్థులకు వైట్ కోట్స్ అందజేశారు. వైట్ కోట్ ప్రతీ వైద్యునికి గుర్తింపుతోపాటు నమ్మకం, సమర్థతకు చిహ్నంగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో గురునానక్ విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్ సైనీ హోమియోపతిక్ కాలేజీ ప్రిన్సిపల్ రేణు తదితరులు పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ సేవలను సద్వినియోగం చేసుకోండి

క్లబ్ డిస్ట్రిక్ మాజీ గవర్నర్ చెన్నకిషన్‌రెడ్డి


వీల్స్ ఆన్ మీల్స్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న చెన్నకిషన్‌రెడ్డి

కడ్తాల్: మారుమూల గ్రామీణ ప్రాంతాలతో పాటు పట్టణ ప్రాంతాల్లో లయన్స్ క్లబ్ అందిస్తున్న సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని క్లబ్ డిస్ట్రిక్ మాజీ గవర్నర్ చెన్నకిషన్‌రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ప్రధాన కూడలిలో క్లబ్ మాజీ సభ్యుడు అనంతరెడ్డి వర్ధంతి సందర్భంగా ఏర్పాటు చేసిన వీల్స్ ఆన్ మీల్స్ అన్నప్రసాద వితరణ కేంద్రాన్ని చెన్నకిషన్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో లయన్స్ క్లబ్ ప్రతిష్టాత్మకంగా వీల్స్ ఆన్ మీల్స్ కార్యక్రమం చేపట్టిందని తెలిపారు. అదేవిధంగా గ్రామాల్లో ఆరోగ్య శిబిరాలు, కంటి పరీక్షలు నిరంతరం చేపడుతున్నట్లు పేర్కొన్నారు. లయన్స్ సేవలను ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి మహేశ్, సభ్యులు రాజేందర్‌యాదవ్, వెంకటేశ్, పీఆర్‌ఓ పాషా ఉన్నారు.

లాల్‌బహదూర్ శాస్త్రికి నివాళి


ఆమనగల్లులో నివాళులర్పిస్తున్న నాయకులు

ఆమనగల్లు: పట్టణంలో శనివారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో స్వాతంత్ర్య సమరయోధుడు, మాజీ ప్రధాని లాల్‌బహదూర్ శాస్త్రి వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా లాల్‌బహదూర్ శాస్త్రి చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ వస్పుల శ్రీశైలం, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు జగన్, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీకాంత్, మాజీ ఎంపీపీ అనితవిజయ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు. అలాగే తలకొండపల్లి మండల కేంద్రంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు డోకూరి ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో లాల్‌బహదూర్‌శాస్త్రి వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్లు అజీం, అంజయ్య, నాయకులు మోహన్‌రెడ్డి, కృష్ణ, కండె ఓంకారం, రవీందర్, నర్సింహ పాల్గొన్నారు.

ఎస్సీ రిజర్వేషన్‌పై ఉద్యమం చేద్దాం

ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు మహేశ్


అవగాహన సదస్సుల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నేతలు

యాచారం: ఎస్సీ రిజర్వేషన్, ఏబీసీడీ వర్గీకరణ సాధనకు ఉద్యమం చేద్దామని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు మూలి మహేశ్ పేర్కొన్నారు. ఫిబ్రవరి 7వ తేదీన హైదరాబాద్‌లో జరిగే లక్ష డప్పులు, లక్షలాదితో తరలింపుపై శనివారం యాచారం మండల కేంద్రంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ రిజర్వేషన్ అమలు చేయాలని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన తీర్పుకు కొందరు అడ్డుపడుతున్నారన్నారు. హైదారాబాద్ ముట్టడితో మాదిగ, మాదిగ ఉపకులాల బలమేమిటో చూపిద్దామన్నారు. ఈ నెల 16వ తేదీ నుంచి ప్రతి గ్రామంలో లక్ష డప్పులు, లక్షలాది తరలింపుపై అవగాహన, చైతన్య సదస్సులు ఉంటాయన్నారు. అంతకుముందు గ్రామాల్లో నిర్వహించే సమావేశాలపై పోస్టర్లను ఆవిష్కరించారు. సమావేశంలో నాయకులు సిద్దపురం శ్రీకాంత్, బోడ ముత్యాలు, మస్కు యాదయ్య, కొండలు, మహేందర్, అజయ్ కుమార్, యంజాల అంజయ్య పాల్గొన్నారు.


క్రీడాకారులను ప్రోత్సహించాలి


టాస్ వేసి క్రీడాపోటీలు ప్రారంభిస్తున్న శ్రీనివాస్‌గౌడ్

పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్

కడ్తాల్: గ్రామీణ క్రీడాకారులను ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలని పీసీసీ సభ్యుడు అయిళ్ల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మండల పరిధిలోని మైసిగండి గ్రామంలో ఎంపీఎల్–5 సీజన్ లీగ్ పోటీలను స్థానిక నాయకులతో కలిసి శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ క్రీడాకారుల్లో దాగి ఉన్న క్రీడానైపుణ్యాలను వెలికితీసేందుకు ఇలాంటి టోర్నీలు దోహదపడతాయన్నారు. క్రీడల్లో గెలుపు, ఓటములు సహజమని, స్ఫూర్తిని ప్రదర్శించి విజేతలుగా నిలవాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు తులసీరాంనాయక్, శేఖర్‌గౌడ్, నాయకులు జవహర్‌లాల్, హీరాసింగ్, రాందాస్ నాయక్, తులసీరాం, స్టాలిన్ కిషన్, అమ్ము, రాజ, రమేశ్, మల్లేశ్, చిన్న, కల్యాన్ తదితరులు పాల్గొన్నారు.

వీధి దీపాలకు స్విచ్‌లు ఏర్పాటు చేయాలి


పగలు కూడా వెలుగుతున్న లైట్లు

కొత్తూరు: విద్యుత్‌ను పొదుపుగా వాడడంతో పాటు సాధ్యమైనంత వరకు వృథా చేయొద్దని అధికారులు ప్రకటిస్తున్నారు. కాగా కొన్ని గ్రామాల్లో వీధి దీపాలకు ఏబీ స్విచ్‌లు లేని కారణంగా నిరంతరాయంగా వెలుగుతున్నాయి. మరికొన్ని గ్రామాల్లో లైట్లకు ఒక చోటనే స్విచ్ ఏర్పాటు చేస్తున్నప్పటికీ సిబ్బంది సకాలంలో లైట్లను నిలిపివేయని కారణంగా విద్యుత్ వృథా అవుతోంది. మండలంలోని వైఎం తండాలో ఉన్న వీధి దీపాలకు ఏబీ స్విచ్‌లు లేకపోవడంతో పగలు, రాత్రి వెలుగుతున్నాయి. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి స్విచ్‌లు ఏర్పాటు చేసి విద్యుత్ వృథాను అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు.